క్లుప్తంగా

భాగవత సప్తాహం ప్రారంభం



తిరువూరు: స్థానిక కోదండ రామాలయంలో భాగవత సప్తాహ ప్రవచనం మంగళవారం ప్రారంభమైంది. శ్రీ త్రిదండి అహోబిల జియర్ స్వామి భాగవతంలోని విశేషాలను భక్తులకు వివరించారు. ప్రతి ఒక్కరూ భాగవతాన్ని చదవడం అలవాటుగా చేసుకోవాలని, నిత్యజీవితంలో ఎదురయ్యే ఎన్నో సమస్యలకు ఈ పురాణ గ్రంథంలో పరిష్కారం లభిస్తుందన్నారు. ఆలయ ప్రధాన అర్చకులు వెంకట గోపాలకృష్ణమాచార్యులు, విఠలాచార్యులు పాల్గొన్నారు.

సామూహిక వ్రతాలు

మైలవరం: మైలవరంలోని వేంకటేశ్వరస్వామి దేవస్థానంలో ఆలయ చైర్మన్ ఎస్వీ సుధాకరరావు ఆధ్వర్యంలో సామూహిక సత్యనారాయణస్వామి వ్రతాలు మంగళవారం నిర్వహించారు. 100 మంది భక్తులు పాల్గొని స్వామి వారికి పూజలు జరిపారు. అనంతరం అన్నదానం చేశారు.

మధ్యాహ్నం 3 గంటలకే తాళాలు



నూజివీడు: పీఏసీఎస్‌ల నిర్వహణలో సిబ్బంది ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. గ్రామీణ ప్రాంతాల్లో రైతుల అభివృద్ధికి సహకార సంఘాల పాత్ర ఎంతో కీలకమైంది. నూజివీడు మండలం జంగంగూడెం పీఏసీఎస్‌ను మధ్యాహ్నం 3 గంటలకే మూసివేసి తాళం వేసి సిబ్బంది వెళ్లిపోయారు. పర్సన్ ఇన్‌చార్జీల పాలనలో పీఏసీఎస్‌ల పనితీరు అధ్వానంగా తయారైందని రైతులు విమర్శిస్తున్నారు. గ్రామానికి చెందిన పలువురు రైతులు మంగళవారం వివిధ పనులపై సొసైటీ వద్దకు వచ్చి తాళాలు వేసి ఉండటంతో వెనుతిరిగి వెళ్లిపోయారు.

చట్టాలపై అవగాహన

నూజివీడు: చట్టాలు, రాజ్యాంగంపై విద్యార్థులు అవగాహన పెంచుకోవాలని ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి కె. హరిబాబు సూచించారు. పట్టణంలోని బీసీ సంక్షేమ బాలికల కళాశాల వసతిగృహంలో మంగళవారం న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. జడ్జి మాట్లాడుతూ పలు చట్టాలను వివరించారు. న్యాయవాది బసవరాజు రామకృష్ణ, హాస్టల్ వార్డెన్ మాధురి, విద్యార్థులు పాల్గొన్నారు.

కాంట్రాక్ట్ కార్మికుల ధర్నా



కొండపల్లి(ఇబ్రహీంపట్నం): ఆయిల్ రంగ సంస్థలో పనిచేస్తున్న కాంట్రాక్ట్ కార్మికులు, డ్రైవర్లకు కనీస వేతనాలు అమలు చేయడంతో పాటు క్రమబద్ధీకరించాలని కొండపల్లి ఐడీఏలో సీఐటీయూ ఆధ్వర్యంలో మంగళవారం ధర్నా నిర్వహించారు. హెచ్‌పీసీఎల్ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షుడు బి.శేఖర్, డ్రైవర్స్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షుడు సుందరరావు, మహేష్, చెన్నారావు, జయరాజు పాల్గొన్నారు.

స్వాతంత్య్ర సమరయోధుడు జగన్‌మోహన్‌రావు మృతి



గంపలగూడెం: స్వాతంత్య్ర సమరయోధుడు, సీపీఐ సీనియర్ నాయకుడు సువారపు జగన్ మోహన్‌రావు (95) సోమవారంరాత్రి మృతి చెందారు. మృతుని కుమారుడు సువారపు చంద్రశేఖరరావు వైఎస్సార్ సీపీ మండల నాయకుడిగా ఉన్నారు. జగన్‌మోహన్‌రావు మృతదేహాన్ని వైఎస్సార్ సీపీ, వామపక్షాల నాయకులు, గ్రామస్తులు సందర్శించి నివాళులర్పించారు. వైఎస్సార్ సీపీ తిరువూరు నియోజకవర్గ ఇన్‌చార్జి నల్లగట్ల స్వామిదాసు సెల్‌ఫోన్ ద్వారా కుటుంబీకులకు సానుభూతి తెలియజేశారు.


సైబర్ నేరాలపై అప్రమత్తం

తిరువూరు: నానాటికీ పెరుగుతున్న సైబర్ మోసాల బారిన పడకుండా బ్యాంకు వినియోగదారులు తగు జాగ్రత్తలు తీసుకోవాలని భారతీయ స్టేట్ బ్యాంకు విజయవాడ రీజనల్ మేనేజరు రాఘవరావు సూచించారు. స్థానిక శ్రీ వాహినీ ఇంజనీరింగ్ కళాశాలలో మంగళవారం టౌన్ హాల్ సమావేశం జరిగింది. ఆయన మాట్లాడుతూ నేరాల నియంత్రణకు పలు సూచనలు చేశారు. విజయవాడ ఎస్‌బీఐ అసిస్టెంట్ జనరల్ మేనేజరు పెయ్యేటి రవి, ఛీఫ్‌మేనేజర్లు పాల్గొన్నారు.

ఘనంగా కురియన్ జయంతి

తిరువూరు: క్షీర విప్లవ పితామహుడు డాక్టర్ వర్గీస్ కురియన్ జయంతి కార్యక్రమం తిరువూరు మండలం లక్ష్మీపురం పాల శీతల కేంద్రంలో మంగళవారం నిర్వహించారు. కురియన్ చిత్రపటానికి క్లస్టర్ మేనేజర్ సాంబశివమూర్తి తదితరులు పూలమాలలు వేసి నివాళులర్పించారు.

● **ఆగిరిపల్లి:** కురియన్ జయంతిని రాజవరం కృష్ణా మిల్క్ యూనియన్ పాల సంఘం ఆవరణలో నిర్వహించారు. చైర్మన్ చలసాని ఆంజనేయులు పాల్గొని కురియన్ చిత్రపటానికి నివాళులర్పించారు. సర్పంచ్ జోల భూషణం, యూనియన్ బోర్డు డైరెక్టర్ పల్లగాని కొండలరావు, క్లస్టర్ మేనేజర్ యశ్వంత్ పాల్గొన్నారు.



శిథిలావస్థలో ఉన్న తిరువూరు మైనర్ ఇరిగేషన్ స్పెషల్ సెక్షన్ కార్యాలయం

అధ్వానంగా అతిథి గృహాలు

నియోజకవర్గ కేంద్రమైన తిరువూరులో పలు ప్రభుత్వ భవనాలు శిథిలావస్థకు చేరాయి. 40, 50 ఏళ్ల కిందట నిర్మించిన భవనాలకు స్వల్ప మరమ్మతులు సైతం చేయకపోవడంతో పూర్తిగా శిథిలమై కూలేందుకు సిద్ధంగా ఉన్నాయి. ఈ భవనాల్లోనే సిబ్బంది భయం భయంగా విధులు నిర్వర్తిస్తున్నారు.

- శిథిలావస్థలో ప్రభుత్వ భవనాలు
- భయంభయంగా సిబ్బంది విధులు
- నిరుపయోగంగా అతిథి గృహాలు
- ప్రతిపాదనల దశ దాటని వైనం
- పునర్నిర్మించాలని కోరుతున్న సిబ్బంది

తిరువూరు: తిరువూరు మండల స్త్రీ శక్తి భవనం (వెలుగు)కు పదేళ్ల కిందట రూ.25 లక్షల వ్యయంతో చేపట్టిన అదనపు భవన నిర్మాణం అసంపూర్తిగా నిలిచిపోయింది. తలుపులు, కిటికీలు చెదలు పట్టి పాడైపోయాయి. మండల మహిళా సమాఖ్య సమావేశాల నిర్వహణకు ఈ భవనాన్ని నిర్మించగా పూర్తికాకపోవడంతో చాలీచాలని గదుల్లో కాలక్షేపం చేస్తున్నారు. ఏపీ హౌసింగ్ కార్పొరేషన్ డివిజనల్ ఇంజినీర్ కార్యాలయ భవనం సైతం గోడలు బీటలు వారి, శ్లాబు పెచ్చులూడిపడుతున్నాయి. పంచాయతీరాజ్ డీఈ కార్యాలయం పరిస్థితి ఇదే విధంగా ఉంది.

కూలేందుకు సిద్ధంగా..

తిరువూరులోని పంచాయతీరాజ్, ఆర్ అండ్ బీ అతిథి గృహాలు కనీస నిర్వహణ లేక శిథిలమవుతున్నాయి. పంచాయతీ రాజ్ అతిథి గృహాన్ని పదేళ్లుగా వినియోగించక పోవడంతో పూర్తిగా కూలిపోయే దశకు చేరింది. అతిథి గృహం ఆవరణలో కొందరు బడ్డీకొట్లు ఏర్పాటు చేసి వ్యాపారం నిర్వహిస్తున్నారు. ఈ భవనాన్ని తొలగించి వాణిజ్య సముదాయం నిర్మించాలని గతంలో మండల పరిషత్ పాలకవర్గం తీర్మానించినా నిధుల లేమితో పనులు చేపట్టలేదు. ప్రభుత్వ కార్యాలయాలకు సమీపంలో అత్యంత రద్దీ ప్రదేశంలో ఉన్న ఈ పంచాయతీ రాజ్ అతిథి గృహాన్ని పునర్నిర్మిస్తే అందరికీ అందుబాటులో ఉంటుందని పలువురు భావిస్తున్నారు. ఆర్ అండ్ బీ అతిథిగృహానికి అత్యవసర మరమ్మతులు చేసి వినియోగంలోకి తీసుకు రావాలని కోరుతున్నారు.



అధ్వానంగా ఉన్న తిరువూరు పంచాయతీరాజ్ అతిథి గృహ ఆవరణ

కొత్త భవనాలు నిర్మించాలి



పురాతన భవనాలు కూలిపోయే స్థితిలో ఉన్నందున ప్రభుత్వ కార్యాలయాలకు కొత్త భవనాలు నిర్మించాలి. నిత్యం గ్రామీణ ప్రజలు వివిధ పనుల నిమిత్తం వచ్చే కార్యాలయాల భవనాలు గోడలు, శ్లాబు శిథిలమై పడిపోయే స్థితిలో ఉంటే ప్రమాదాలు జరిగే అవకాశం ఉంది.

– ఐవీకే కిశోర్, లక్ష్మీపురం

కాంప్లెక్స్ నిర్మాణం ప్రయోజనం



తిరువూరు పట్టణంలో ప్రభుత్వ స్థలాలు సరిపడా ఉన్నందున అన్ని కార్యాలయాలనూ ఒకేచోట నిర్మించాలి. రెవెన్యూ డివిజన్ కేంద్రమైన తిరువూరులో కార్యాలయాలు మారుమూల ఉంటే ప్రజలకు ఇబ్బందికరంగా ఉంటోంది. ఒకే కాంప్లెక్సులో అన్ని కార్యాలయాలు ఉంటే ప్రయోజనకరంగా ఉంటుంది.

– సాంబారు వెంకటేశ్వర్లు, తిరువూరు

రాజ్యాంగానికి తూట్లు పొడుస్తున్న కూటమి ప్రభుత్వం

మేకా వెంకట ప్రతాప్ అప్పారావు



అంబేడ్కర్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న మేకా వెంకట ప్రతాప్ అప్పారావు

నూజివీడు: రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి రాజ్యాంగానికి తూట్లు పొడుస్తూ పాలన సాగిస్తోందని మాజీ ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ అప్పారావు అన్నారు. పట్టణంలోని వెంకట ప్రతాప్ అప్పారావు కార్యాలయంలో మంగళవారం భారత రాజ్యాంగ దినోత్సవాన్ని నిర్వహించారు. రాజ్యాంగ నిర్మాత బీఆర్ అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ప్రతాప్ అప్పారావు మాట్లాడుతూ రాజ్యాంగం ద్వారా దేశ ప్రజలందరికీ సమాన హక్కులు, స్వేచ్ఛ, బాధ్యతలు లభించాయన్నారు. తరతమ బేధాలు లేకుండా ప్రభుత్వాలు పాలన సాగించాల్సి ఉందని చెప్పారు. కానీ కూటమి ప్రభుత్వం రాజ్యాంగానికి తూట్లు పొడుస్తూ వైఎస్సార్ సీపీ కార్యకర్తలు, నాయకులపై అక్రమ కేసులు బనాయించడం, అక్రమ అరెస్టులు, దాడులు వంటి అప్రజాస్వామ్య ఘటనలకు పాల్పడుతోందని ధ్వజమెత్తారు.

బీఆర్ అంబేడ్కర్ విగ్రహాన్ని కూల్చడం హేయం

ఏలూరు జిల్లా ద్వారకా తిరుమలలో రాజ్యాంగ నిర్మాత బీఆర్ అంబేడ్కర్ విగ్రహాన్ని కూల్చడం హేయమైన చర్య అని మాజీ ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ అప్పారావు నిరసన వ్యక్తం చేశారు. విగ్రహాన్ని కూల్చిన దుండగులను వెంటనే అరెస్టు చేసి వారికి తగిన శిక్ష పడేలా చూడాల్సిన బాధ్యత పోలీసులపై, కూటమి ప్రభుత్వంపై ఉందన్నారు. రాజ్యాంగ నిర్మాత విగ్రహాన్ని కూల్చివేసిన దుష్టశక్తుల ఆట కట్టించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు.కార్యక్రమంలో జెడ్పీ వైస్ చైర్మన్ గుడిమళ్ల కృష్ణంరాజు, వైఎస్సార్ సీపీ పట్టణ అధ్యక్షుడు శీలం రాము, వైఎస్సార్ సీపీ నాయకులు పిల్లా చరణ్, షేక్ యూనస్‌పాషా (గబ్బర్), చేబత్తిన మున్నా, కౌన్సిలర్ బాణావతు రంగారావు, బసవా వినయ్, మాజీ కౌన్సిలర్ కంచర్ల లవకుమార్ పాల్గొన్నారు.

సమస్యలపై ప్రజా సంఘాల ధర్నా



తిరువూరులో ఆర్డీఓ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న నాయకులు

తిరువూరు: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ప్రజా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ వామపక్షాల అనుబంధ ప్రజా సంఘాలు, కార్మిక సంఘాల ఆధ్వర్యంలో తిరువూరు ఆర్డీఓ కార్యాలయం ఎదుట మంగళవారం ధర్నా నిర్వహించారు. సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్‌సీహెచ్ శ్రీనివాసరావు మాట్లాడుతూ విద్యుత్ ట్రూ అప్ చార్జీలు రద్దు చేయాలని, నిత్యావసర సరుకుల ధరలు తగ్గించాలని, పంటలకు గిట్టుబాటు ధరలు కల్పించాలని, కార్మిక సంక్షేమానికి ప్రవేశపెట్టిన చట్టాలను నీరుగార్చే చర్యలకు స్వస్తి పలకాలని కోరారు. ధరల నియంత్రణ చర్యలు తీసుకోవడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పూర్తిగా విఫలమయ్యాయని విమర్శించారు. డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని ఆర్డీఓ మాధురికి అందజేశారు. ధర్నాలో సీఐటీయూ, ఏఐటీయూసీ, కిసాన్ మోర్చా, కార్మిక సంఘాల ఐక్యవేదిక, కౌలు రైతు సంఘం నాయకులు గుళ్లపల్లి వెంకటరత్నం, నాగేంద్రప్రసాద్, ఉదయ్, సుబానీ, నాగుల్‌మీరా, వెంకటేశ్వరరావు, ఎస్‌వీ భద్రం తదితరులు పాల్గొన్నారు.

బడుగులకు అండగా భారత రాజ్యాంగం

తిరువూరు: బడుగు, బలహీనవర్గాలు, సామాజికంగా అణచివేతకు గురైన వర్గాలకు అండగా భారత రాజ్యాంగం నిలుస్తోందని తిరువూరు నగర పంచాయతీ చైర్‌పర్సన్ గత్తం కస్తూరిబాయి అన్నారు. భారత రాజ్యాంగ ఆమోద దినోత్సవం సందర్భంగా మంగళవారం స్థానిక నగర పంచాయతీ కార్యాలయంలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ చిత్రపటానికి కౌన్సిలర్లు, అధికారులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కమిషనర్ లోవరాజు, వైస్ చైర్‌పర్సన్లు విజయలక్ష్మి, వెంకటేశ్వరి, కౌన్సిలర్లు, వైఎస్సార్ సీపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు. బోస్ సెంటర్లోని అంబేడ్కర్ విగ్రహానికి పలువురు వైఎస్సార్ సీపీ నాయకులు నివాళులర్పించారు. శ్రీ వాహినీ ఇంజినీరింగ్ కళాశాల, శ్రీనిధి స్కూల్, లక్ష్మీపురం, చిట్టేల ఎంపీయూపీ స్కూళ్లలో విద్యార్థులు, ఉపాధ్యాయులు రాజ్యాంగ ఆమోద దినోత్సవంలో పాల్గొన్నారు.

● **మైలవరం:** భారత దేశ ఖ్యాతిని ప్రపంచానికి చాటి చెప్పిన పవిత్ర గ్రంథం మన రాజ్యాంగమని వక్తలు పేర్కొన్నారు. మైలవరంలో మండల పరిషత్ కార్యాలయం కూడలిలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహానికి రాజకీయ పార్టీల నాయకులు నివాళులర్పించారు.

● **మైలవరం:** జి.కొండూరు మండలం చెవుటూరు గ్రామంలోని అమృత సరోవర్ ట్యాంక్ వద్ద గ్రామ సభ నిర్వహించి, గ్రామస్తులు, అధికారులతో ప్రతిజ్ఞ చేయించారు.

● **ఇబ్రహీంపట్నం:** ఏపీఎస్‌ఈబీ ఎస్సీ, ఎస్టీ ఎంప్లాయీస్ వెల్ఫేర్ అసోసియేషన్ కోశాధికారి తాణికొండ మణిబాబు ఆధ్వర్యంలో ఎన్టీటీపీఎస్ చీఫ్ ఇంజినీర్ టి.నాగరాజు అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళుర్పించారు. అసోసియేషన్ రాష్ట్ర నాయకులు మనోహర్, ఎస్‌ఈలు ప్రసాద్, వెంకటరావు, సత్య ప్రసాద్, కాంతారావు, కొత్తపల్లి వెంకటరమణ, పర్వతనేని సాంబశివరావు, ప్రశాంత్ కుమార్ పాల్గొన్నారు. ఎంపీపీ కార్యాలయంలో అంబేడ్కర్ చిత్రపటానికి ఎంపీడీఓ సునీత శర్మ నివాళుర్పించారు. సిబ్బంది పాల్గొన్నారు. కాచవరం ఎంపీపీ పాఠశాలలో అంబేడ్కర్ చిత్రపటానికి విద్యార్థులు శ్రద్ధాంజలి ఘటించారు. ప్రసాద్‌నగర్ కమ్యూనిటీ హాల్‌లో కొటికలపూడి సర్పంచి రెంటపల్లి నాగరాజు, బేతపూడి కాంతారావు తదితరులు అంబేడ్కర్‌కు పుష్పాంజలి ఘటించారు.



ఇబ్రహీంపట్నంలో అంబేడ్కర్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న నాగరాజు, నాయకులు

● **చంద్రాల(మైలవరం):** చంద్రాల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సర్పంచ్ జె.జ్యోతి అధ్యక్షతన జరిగిన భారత రాజ్యాంగ దినోత్సవ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ గంగాధరరావు మాట్లాడారు. ప్రధానోపాధ్యాయుడు వరద శ్రీనివాసరావు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రజాస్వామ్య వ్యవస్థకు మూలం రాజ్యాంగం

భవానీపురం(విజయవాడపశ్చిమ): ప్రజాస్వామ్య వ్యవస్థకు మూలం డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ రచించిన భారత రాజ్యాంగమని మైలవరం ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణప్రసాద్ అన్నారు. భారత రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా గొల్లపూడిలోని ఆయన కార్యాలయంలో అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ రాజ్యాంగ విలువలను కాపడటమే ఆయనకు మనమిచ్చే నిజమైన ఘన నివాళి అని అన్నారు.

● **నూజివీడు:** పట్టణంలోని త్రివిధ హైస్కూల్లో జరిగిన కార్యక్రమంలో విద్యార్థులు జాతీయ నాయకుల వేషధారణతో ఆకట్టుకున్నారు. ప్రిన్సిపాల్ సబ్బినేని శ్రీనివాస్ రాజ్యాంగం విశిష్టతను వివరించారు. గొల్లపల్లి హైస్కూల్లో అంబేడ్కర్ చిత్రపటానికి హెచ్‌ఎం పొట్లూరి రాధికారాణి పూలమాల వేసి నివాళులర్పించారు. విద్యార్థులందరూ రాజ్యాంగంపై అవగాహన పెంచుకోవాలని సూచించారు. ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



తిరువూరు బోస్ సెంటర్లో అంబేడ్కర్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

● **మైలవరం:** మైలవరం లకిరెడ్డి బాలిరెడ్డి ఇంజనీరింగ్ కళాశాలలో భారత దేశ రాజ్యాంగ దినోత్సవం, జాతీయ చట్ట దినోత్సవాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.అప్పారావు మాట్లాడుతూ పేద, అనాథ పిల్లల సహాయార్థం కళాశాల విద్యార్థులు రూ.6వేలు విరాళాలు సేకరించి పేదలకు అందజేశారని అభినందించారు. ఈ సందర్భంగా నిర్వహించిన వ్యాస రచన పోటీల విజేతలకు బహుమతులు అందజేశారు.

● **చాట్రాయి:** మండలంలోని పలు గ్రామాల్లో మంగళవారం రాజ్యాంగ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. తుమ్మగూడెం ఉర్దూ పాఠశాలలో హెచ్‌ఎం వెంకట్ ఆధ్వర్యంలో రాజ్యాంగ దినోత్సవం జరిగింది. చనుబండలో జరిగిన కార్యక్రమంలో సర్పంచ్ విస్సంపల్లి జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

● **తోటమూల(గంపలగూడెం):** తోటమూల వై-జంక్షన్‌లోని అంబేడ్కర్ విగ్రహానికి పలువురు పూలమాల వేసి నివాళులర్పించారు. జెడ్పీటీసీ కోట శామ్యూల్, మాజీ ఎంపీపీ కోట దాసు, వైఎస్సార్ సీపీ జిల్లా కమిటీ సభ్యులు చెరుకు నర్సారెడ్డి, సర్పంచ్ కోట పుల్లమ్మ, ప్రజా సంఘాల నాయకులు పాల్గొన్నారు. సచివాలయ ఉద్యోగులు, వివిధ ఉపాధ్యాయ సంఘాల ఆధ్వర్యంలో తోటమూల రాజ్యాంగ ఆమోద దినోత్సవం జరిపారు. ఎంపీడీఓ చెన్నయ్య తదితరులు పాల్గొన్నారు.



విస్సన్నపేటలో అంబేడ్కర్ విగ్రహం వద్ద వైఎస్సార్ సీపీ నాయకుల నివాళి

● **విస్సన్నపేట:** స్థానిక అంబేడ్కర్ సెంటర్‌లో వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో అంబేడ్కర్, జగ్జీవన్ రామ్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు నెక్కళపు కుటుంబరావు, తెలుగు అధ్యాపకుడు జయరాజు, సర్పంచ్ సాధుపాటి నాగమల్లేశ్వరి, వైస్ ఎంపీపీ రెడ్డి శ్రీనివాసరావు, ఎంపీటీసీ జి. మల్లయ్య పాల్గొన్నారు.

● **నూజివీడు:** మాల యోధుల సంక్షేమ సంఘం, బీఆర్ అంబేడ్కర్ యువజన సంఘం ఆధ్వర్యంలో నూజివీడులోని శ్రీనివాస సెంటర్‌లో అంబేడ్కర్ విగ్రహానికి నివాళులర్పించారు.

● **ముసునూరు:** స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో అంబేడ్కర్ చిత్ర పటానికి ఎంపీడీఓ జి.రాణి పూలమాల వేసి నివాళులర్పించారు. రమణక్కపేట జెడ్పీ హైస్కూల్‌లో చిన్నారులు సాంఘిక శాస్త్ర నమూనాలను ప్రదర్శించి, రాజ్యాంగ దినోత్సవాన్ని తెలిపే విధంగా ఆంగ్ల అక్షరాల ఆకారంలో కూర్చుని ఆకట్టుకున్నారు.

● **ఆగిరిపల్లి:** సురవరం మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో తహసీల్దార్ ప్రసాద్, ప్రధానోపాధ్యాయుడు అంకం వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

పశువులకు టీకాలు

చిలుకూరు(ఇబ్రహీంపట్నం): పశువుల్లో గర్భకోశ వ్యాధుల నివారణకు చర్యలు చేపట్టాలని గన్నవరం పశుగణాంక సంస్థ కార్యనిర్వాహక అధికారి డాక్టర్ శ్రీనివాసులు అన్నారు. చిలుకూరులో గర్భకోశ వ్యాధుల నివారణకు ప్రత్యేక వైద్యశిబిరం మంగళవారం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ గర్భకోశ వ్యాధుల నివారణతో పశువులు ఈనిన మూడు నెలల్లో తిరిగి చూలు వచ్చేలా చేసుకోవాలన్నారు. దీని ద్వారా ఏడాదికి ఓ దూడకు పశువులు జన్మనిస్తాయని చెప్పారు. ఈవిధానంతో రైతులు లాభపడతారన్నారు. శిబిరంలో 74 పశువులకు గర్భకోశ వ్యాధుల చికిత్స, 29 దూడలకు నట్టల నివారణ, 19 పెయ్యి దూడలకు బ్రూసెల్లా వ్యాధి నిరోధక టీకాలు వేశామని చెప్పారు. మిక్సర్, క్యాల్షియం ప్యాకెట్లు పంపిణీ చేశారు. నందిగామ ఉప సంచాలకులు మోజెస్ వెస్లీ, ఇబ్రహీంపట్నం సహాయ సంచాలకులు రాధాకృష్ణ, పశువైద్యాధికారులు శైలుమాధురి, మోహన్ కిశోర్, శంకర్‌నాయక్ పాల్గొన్నారు.

కార్తిక వన సమారాధన

మైలవరం: మైలవరం టెంట్ హౌస్ అండ్ క్యాటరర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో కార్తిక వనసమారాధన కార్యక్రమం మంగళవారం స్థానిక ఏరువ గురువారెడ్డి మామిడి తోటలో నిర్వహించారు. ఈ సందర్భంగా లక్కీ డ్రా తీసి విజేతలకు బహుమతులు అందజేశారు. అసోసియేషన్ నాయకులను సన్మానించారు.

● **మైలవరం:** నాయీ బ్రాహ్మణ సేవా సంఘం ఆధ్వర్యంలో కార్తిక వన సమారాధన నిర్వహించారు. ఎంపీపీ వేములకొండ లక్ష్మీ తిరుపతమ్మ, ఎస్‌ఐ సతీష్ కుమార్, నాయీబ్రాహ్మణులు కుటుంబ సభ్యులతో కలిసి పాల్గొన్నారు. మధ్యాహ్నం సహపంక్తి భోజనాలు చేశారు.

పందుల పట్టివేత

సాక్షి ఎఫెక్ట్

ఆగిరిపల్లి: ఆగిరిపల్లిలో విచ్చలవిడిగా సంచరిస్తున్న పందుల పట్టివేత కార్యక్రమాన్ని మంగళవారం పెద్దఎత్తున నిర్వహించారు. ఈనెల 25న సాక్షిలో ఆగిరిపల్లిలో పందుల స్వైరవిహారం శీర్షికన కథనం ప్రచురితమైంది. స్పందించిన ఈఓపీఆర్డీ ఆనంద్‌బాబు ఆధ్వర్యంలో పంచాయతీ సిబ్బంది గ్రామంలో సంచరిస్తున్న పందులను పట్టుకొని వాహనంలో శివారు ప్రాంతానికి తరలించారు. పందులు గ్రామంలో సంచరిస్తే వాటి యజమానులపై కఠిన చర్యలు తీసుకుంటామని ఆనంద్‌బాబు హెచ్చరించారు.

ధాన్యం తడవకుండా జాగ్రత్త వహించాలి

ఆంజనేయపురం(తిరువూరు): తుపాను కారణంగా భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున మూడు రోజుల పాటు ధాన్యం కోతలు నిలిపివేయాలని తిరువూరు మండల వ్యవసాయాధికారి పద్మ రైతులకు సూచించారు. మండలంలోని ఆంజనేయపురంలో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ధాన్యం తడవకుండా రైతులు తగు జాగ్రత్తలు తీసుకోవాలని, ఇప్పటికే కోతలు పూర్తయిన రైతులు ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాలకు తరలించాలని సూచించారు.

కార్నియాల సేకరణ

కొత్తపల్లి(గంపలగూడెం): కొత్తపల్లికి చెందిన నరెడ్ల మురళీ మోహన్‌రెడ్డి (67) సోమవారం రాత్రి ఇంటి వద్ద మృతిచెందారు. మృతుని నేత్రాలను దానం చేయాలని కుటుంబ సభ్యులను లయన్స్ క్లబ్ ప్రతినిధి గోగిరెడ్డి కృష్ణారెడ్డి కోరారు. వారు అంగీకరించడంతో విజయవాడ ఎల్‌వీ ప్రసాద్ కంటి వైద్యశాలకు సమచారం అందించారు. అక్కడి వైద్యులు వచ్చి మృతుడి కార్నియాలను సేకరించారు.

వ్యక్తిత్వ వికాసంపై టీచర్లకు శిక్షణ

కొండపల్లి(ఇబ్రహీంపట్నం): క్రాంతి హైస్కూల్ ఉపాధ్యాయులకు వ్యక్తిత్వ వికాసంపై ఏర్పాటు చేసిన రెండు రోజుల శిక్షణ తరగతులను లయన్స్ జిల్లా గవర్నర్ గద్దె శేషగిరి మంగళవారం ప్రారంభించారు. లయన్స్ క్వెస్ట్ శిక్షణలో విద్యార్థుల్లో భావోద్వేగాల నియంత్రణ, సమాజ సంబంధాలు, వ్యక్తిత్వ వికాసం అంశాలపై ఉపాధ్యాయులకు శిక్షణ ఇస్తారన్నారు. ఉప జిల్లా గవర్నర్ ఆంజనేయులు, పూర్వ గవర్నర్ దేవినేని కిశోర్‌కుమార్, శిక్షకురాలు లక్ష్మీ మూర్తి, జిల్లా క్వెస్ట్ చైర్మన్ యర్రంరెడ్డి గాంధీ, పాఠశాల కరస్పాండెంట్ మురళీమోహన్ పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజనం పరిశీలన

తోటమూల(గంపలగూడెం): ప్రభుత్వ నిర్ణయం మేరకు మధ్యాహ్న భోజనం పథకం మెనూ సక్రమంగా అమలు చేయాలని గంపలగూడెం తహసీల్దార్ రాజకుమారి అన్నారు. మండలంలోని కేజీబీవీలో మధ్యాహ్న భోజనాన్ని మంగళవారం ఆమె పరిశీలించారు. మధ్యాహ్న భోజన సంబంధించిన రికార్డులు, స్టాక్‌ను ఆమె పరిశీలించారు. వంట ఏజెన్సీ నిర్వాహకులకు సూచనలు చేశారు. పాఠశాల ప్రత్యేకాధికారి ఎం. వెంకటలక్ష్మి, ఆర్ఐ వీరభద్రరావు, వీఆర్వోలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

విద్యార్థులకు పోటీలు

తిరువూరు: ఎ.కొండూరు మండలం పోలిశెట్టిపాడు జెడ్పీ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు రాజ్యాంగంలోని అంశాలపై క్విజ్, వ్యాసరచన పోటీలు జరిగాయి. చారిత్రక ప్రాధాన్యత కలిగిన పుస్తకాలు, నాణేల ప్రదర్శన ఏర్పాటు చేశారు. రాజ్యాంగ పీఠికపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. విద్యార్థులతో రాజ్యాంగ దినోత్సవ ప్రతిజ్ఞ చేయించారు. రామచంద్రాపురం జెడ్పీ ఉన్నత పాఠశాలలో జరిగిన రాజ్యాంగ ఆమోద దినోత్సవం, సాంఘిక శాస్త్ర దినోత్సవాల్లో విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

18 మందికి ఉద్యోగాలు

తిరువూరు: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఏపీ నైపుణ్యాభివృద్ధి సంస్థ, జిల్లా ఉపాధి కల్పనా కార్యాలయాల సంయుక్త ఆధ్వర్యంలో మంగళవారం జాబ్ మేళా నిర్వహించారు. యాక్సిస్ బ్యాంక్, మెడ్ ప్లస్, సుధీర్ టింబర్స్ సంస్థల్లో ఖాళీగా ఉన్న పలు ఉద్యోగాలకు 37 మంది ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోగా 18 మందిని ఎంపిక చేశారని కళాశాల ప్రిన్సిపాల్ సుశీలరావు తెలిపారు. జిల్లా ఉపాధి కల్పనాధికారి విక్టర్‌బాబు, జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి శ్రీనివాసరావు ఇంటర్వ్యూలు నిర్వహించారు.

ప్రజాస్వామ్యంలో ఓటు విలువైనది

ఆర్డీఓ మాధురి




విస్సన్నపేట: ప్రజాస్వామ్యంలో ఓటు ఎంతో విలువైనదని, 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరూ ఓటు నమోదు చేయించుకోవాలని ఆర్డీఓ కె. మాధురి అన్నారు. స్థానిక వికాస్ పీజీ కళాశాల ఆడిటోరియంలో ఓటు నమోదుపై విద్యార్థులకు మంగళవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆర్డీఓ మాట్లాడుతూ ఓటు నమోదు కార్యక్రమం ప్రతి గ్రామంలో నిర్వహిస్తున్నామని చెప్పారు. అనంతరం అంబేడ్కర్ సెంటర్‌లో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహానికి ఆర్డీఓ పూలమాల వేసి నివాళులర్పించారు. ఓటు నమోదును విధానాన్ని వివరించి అవగాహన ర్యాలీ, మానవహారం నిర్వహించారు. తహసీల్దార్ కె. లక్ష్మీకల్యాణి, ఎంపీడీఓ చేకు చిన్నరాట్నాలు, సర్వే డీటీ విజయభాస్కర్, డీటీ హేమంత్, వికాస్ విద్యా సంస్థల చైర్మన్ నరెడ్ల నర్సిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

డ్రోన్ కెమేరాతో నిఘా

నూజివీడు: మండలంలోని మామిడి తోటలు, కొండ ప్రాంతాల్లో పేకాట, కోడిపందేలలు, సారా తయారీ వంటి అసాంఘిక కార్యకలాపాల నియంత్రణకు డ్రోన్ కెమెరాతో నిఘా ఏర్పాటు చేశామని రూరల్ ఎస్‌ఐ ఎన్ లక్ష్మణ్‌బాబు మంగళవారం తెలిపారు.మారుమూల ప్రాంతాల్లో నిర్వహించే జూదాలపై ఉక్కుపాదం మోపుతున్నామన్నారు.

రోడ్ల నిర్మాణం పేరుతో అక్రమ తవ్వకాలు



మైలవరం: మమ్మల్ని అడ్డుకునేదెవరు అంటూ టీడీపీ నాయకులు చెలరేగిపోతున్నారు. సీసీ రోడ్డు నిర్మాణం పేరుతో ప్రభుత్వ అనుమతులు లేకుండా మట్టిని తవ్వుకుని అందిన కాడికి సొమ్ము చేసుకుంటున్నారు. మైలవరం నియోజకవర్గం జి.కొండూరు మండలం చెవుటూరు గ్రామంలో సీసీ రోడ్ల నిర్మాణానికి స్థానిక టీడీపీ నాయకులకు కాంట్రాక్టు ఇచ్చారు. దీనితో సీసీ రోడ్డు నిర్మాణం మొక్కుబడిగా ప్రారంభించి దీనిని అడ్డు పెట్టుకుని అనుమతి లేకుండా గతంలో పేదలకు ఇళ్ల స్థలాలు పంపిణీ చేసేందుకు చెవుటూరు గ్రామ శివారులోని గట్టు పక్కన చదును చేసిన ప్రాంతం నుంచి కాంట్రాక్టర్ మట్టి తవ్వి తరలిస్తున్నారు. కాగా సీసీ రోడ్ల నిర్మాణానికి కాంట్రాక్టర్‌కు ప్రభుత్వం సొమ్ము చెల్లిస్తున్నప్పటికీ, సదరు కాంట్రాక్టర్ అనధికారికంగా ఈ ప్రాంతంలోని మట్టిని తవ్వి సొమ్ము చేసుకుంటుండటంతో స్థానికులు మండల రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేశారు. అధికారులు స్పందించడంతో అక్రమ తవ్వకాలను నిలిపివేశారు.

సాక్షి
సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
తిరువూరు డివిజన్
99510 20399 (తిరువూరు,
99122 20544 (నూజివీడు)
90102 23734 (మైలవరం)
Office mail : sakshiads@gmail.com